స్కెచ్

# అతిథి చేసిన సహాయం

అవసరాల రామకృష్ణరావు

"ఏమండీ, కార్డు దొరకలేదా?"

"దొరక్కేం, దొరికింది పద్మా."

"మరేం అలా వున్నారు?"

"దొరికింది రేషన్ కార్డు కాదులే, పోస్టు కార్డు!"

"అలాగా! ఎక్కడనుంచి? మరి రేషన్ కార్డు మాట?"

"లతకోసం వెతుకుతూంటే ముళ్ళతీగె కాళ్ళకు చుట్టుకున్నట్టు, రేషన్ కార్డు దొరక్కపోతే పోయింది. ఈ కార్డు ఒకటా?"

"ఏం, ఎవరు వ్రాశారు?"

"పాత్రుడుగారు!"

"పాత్రుడుగారెవరండీ?"

"ఎవరని చెప్పను? మనపాలిటి అపాత్రుడు, నా చిన్ననాటి స్నేహపాత్రుడు. భోజనానికి దయాపాత్రుడు."

"తెలిసింది కాని, ఏమని వ్రాశాడు?"

"మనమీద మహా అభిమానం ముంచుకుపోతున్నట్టు... కాకినాడ వెడుతున్నాట్ట. ఈ పూట ఇక్కడ దిగి మధ్యాహ్నం రైల్లో వెడతాట్ట!"

"చచ్చాం. ఏందారి?"

"ఈ ఇల్లు స్నేహితులకు 'రహదారి' అయినంతకాలం మన పని గోదావరే!"

"సరేకాని, ఎలాగండీ? వచ్చినవాడికి ఓ పూట భోజనం పెట్టకపోతే బాగుంటుందా? మనకే బియ్యం సరిపోక ఇంకోళ్ళని కార్డులడుగుతున్నాం కూడాను! పోనీ ఏదేనా వంకపెట్టి రావద్దని రాసెయ్యకపోయారా?"

"రాయడానికి టైమేదీ? కార్డుపడేసి మరీ రైలెక్కేడు గడుసుఘటం!"

"అయితే ఏంచేద్దామంటారు?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. వారానికి ఇచ్చిన బియ్యం సహం రోజులికి సరిపోవడమే బ్రహ్మాండమైపోతూంది. ఒకపూట అయితే మాత్రం ఎంత." "పోను" లాగుతాడో, ఎందర్ని వెంటబెట్టుకొస్తాడో!"

"ఎయితే ఎలాగ?"

"అదే ఆలోచించు. ఆడదానికి ఆలోచన లెక్కువంటారు."

"అంతదాకా వస్తే మా జాతి గౌరవం పోనియ్యనండోయ్."

"ఏదేనా దారి చూపించు మరి!"

"ఇలారండీ... మంచి ఉపాయం తట్టింది."

"ఏమిటది? ...ఓహో అదా?... చాలా బాగుంది!"

* * *

"రారా పాత్రుడూ, ఎన్నాళ్లకు కలుసుకున్నాం?"

"మొన్న మన లక్ష్మీపతి చెప్పేదాకా నువ్విక్కడున్నావని తెలియలేదు సుమా. ఎంతలా మారిపోయావురా ప్రభాకర్!"

"నువ్వొస్తావని రాసినదగ్గర్నుంచి నువ్వొచ్చేదాకా నాకేం తోచలేదు. అలా ఈ గదిలోకి పద. మరేం మొహమాటపడకు మా ఇల్లే అనుకో. పద్మా, ఇదిగో మా పాత్రుడు వచ్చాడు."

"ఇలా యీ మూలగదిలోకి రండి."

"ఆడేమిటి అక్కడేం చేస్తున్నావ్- పదరా పాత్రుడూ. అయ్యయ్యో తీరా మావాడు వచ్చేసరికి ఓ చెంబూ చాపా నువ్వు తయారా? అయినా యీ ఆడవాళ్ళకి ఓ వేళా పాళా లేదు బాబూ!"

"బాగుందండీ మీ హాస్యం!- రండి అన్నయ్యగారూ? నిన్న మీరు కార్డు రాసిందగ్గిర్నుంచీ మావారికి మతి లేదనుకోండి. నన్నో క్షణమైనా నిలబడనిస్తేనా? కాని ఏం లాభం? మీకు పిడికెడు మెతుకులేనా పెట్టకుండా నే అవతల తగులడ్డాను!"

"దానికి మీరేం చేస్తారమ్మా, అట్టే విచా

రించి మనసు పాడు చేసుకోకండి. అదేమిటిరా ప్రభాకర్ ఎక్కడికి బయల్దేరుతున్నావ్?"

"మా ఆఫీసర్ క్షణం ఆలస్యమయితే ఒప్పుకోడురా. ఈ ఒక్క పూటా సెలవైనా యిమ్మంటే ఇవ్వనన్నాడు కర్కోటకుడు."

"మరి భోజనమో!"

"ఏం చెయ్యాను, ఈ మూడురోజులూ యించుమించు ఉపవాసాలే చెయ్యాలి..."

"నిజమే అన్నయ్యగారూ, ఆయనకి హోటల్ భోజనం పడదు. ఆమధ్య తిని, అజీర్తిచేసి చాలా బాధ పడ్డారంటే నమ్మండి. ఈయనకి చెయ్యలేక నా నవనాడులూ కుంగిపోయాయి. ఏపళ్లో కొనుక్కు మింగుతారు. ఆయన్ని వెళ్ళనివ్వండి అన్నయ్యా!"

"ఎవరూ లేనప్పుడు నేనెందుకమ్మా యింట్లో! పదిన్నరకి ప్యాసింజరుంది. ఇంకా పదింపావే ఐంది. వెడతానమ్మా! వెడతానురా ప్రభాకర్.

* * *

"ఇంక బయటుండడం చాలుగాని యిలా లోపలికిరా"

"ఉండండి. ఆయనింకా వీధి మలుపు తిరిగేరో లేదో చూడండి."

"పోయాడుగాని ఉన్న బియ్యమేదో చూసి పొయ్యిమీద పడెయ్. నాకు నిజంగా ఆఫీసుకి వేళయి పోతూంది."

"ఓపట్టాన వదిలేడు కాదు సుమండీ జీడిలాగ! ఎంత తెగించిన పురుషు కాకపోతే 'మరి భోజనమో!' అని అడుగుతాడు! మీ రెక్కడ హోటల్ కంటారో అని ప్రాణం గిలగిల లాడిపోయింది సుమండీ! మీకూడా వెంటపడును హోటల్ కి-ఉత్తి సర్వభక్షకుడిలా ఉన్నాడు!"

"చాలా గొప్పపనిచేసేవుగాని నీ పరాక్రమం వంటింట్లో చూపించు, అయ్యయ్యో పద్మా! ఇదేమిటి? ఆ మలుపుదగ్గిర చూడు!"

"అదేమిటండీ ఆశ్చర్యం! మీ పాత్రుడు మళ్ళీ వస్తున్నట్టున్నారు. వెనకొతల ఓముసిలావిడ కూడాను. అయ్యో ఇప్పు డెలాగండీ?"

"ఏం చెప్పనూ, నాకేం తోచకుండా ఉంది. సరే కాని యింకా అలా చూస్తూ


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

స్థాపితము: 1923

హెడ్డాఫీసు: మచిలీపట్టణము

మదరాసు బ్రాంచి:
బొంబే మ్యూచియల్ బిల్డింగ్
378, ఎస్ప్లనేడ్.

త్యాగరాయ నగర్ ఆఫీసు:
18/28 పాండీ బజారు.

మైలాపూర్ ఆఫీసు:
49, కచేరీ రోడ్డు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరము, తిరుపతి, కర్నూలు, గూడూరు, ఒంగోలు చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్ పేట(గుంటూరు), గవర్నరుపేట (బెజవాడ), గుడివాడ, పాలకొల్లు భీమవరం, సామర్లకోట, రామారావుపేట, (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి చికాకోల్ (వైజాగ్), పెద్దాపురం, అమలాపురం, ఆముదాలవలస తిరువూరు, పెడన (కృష్ణా), సాలూరు, చల్లపల్లి, మహారాణిపేట, (విశాఖపట్టణము) జగ్గయ్యపేట (కృష్ణా), గొల్లప్రోలు (తూ. గో.) బాపట్ల (గుంటూరు)

వివరములు ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

తాడేపల్లి శ్రీరాములు
మేనేజింగ్ డైరెక్టర్.

**ఇ. రామచంద్రమూర్తి,**
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

కూర్చుంటావేమిటి శత్రువులు శరవేగంతో వస్తూంటే! ఆ బొట్టు చెరిపేసుకో, ఆ పువ్వులు తీసెయ్యి చావేదీ?"

"అయ్యో, ఆ మూల పెట్టెను సమయానికి ఒకటీ కనపడదు."

"సరేలే ముందు పెరట్లోకి పారిపో"

"..............."

"ప్యాసింజరు దొరకలేదుగాని మా గొప్ప మనిషి దొరికిందిలే. ఈవిడ మా పిన్నత్తగారు. రాజమండ్రీ వెడుతూంటే బలవంతం చేసి ఇక్కడ దింపేశాను నీ యిబ్బంది చూడలేక. ఈ మూడురోజులూ ఇంట్లో మనిషిలా వండి పెడుతుంది. సరదాగా నీతో మూడురోజులున్నట్టూ ఉంటుంది. వెళ్ళండమ్మా భయపడకండి. ఓ శేరున్నర బియ్యం కొలిచి యివ్వరా ప్రభాకర్! నిమషంలో వండేస్తుంది!"

# "గుంటూరు సభ చిట్కాలు"

జనవరి 10వ తేదీ 'స్వతంత్ర'లో ప్రచురితమైన "గుంటూరుసభ చిట్కాలు" అనే సంపాదకీయానికి నా అభినందనలు. ఆ కార్యకలాపాలను గురించి మీరు వివరించిన విషయాలే ఆంధ్రులలో చాలామందికి తోచివుంటాయి. కేంద్రమంత్రి శ్రీ హరేకృష్ణ మెహతాబ్ "ఆంధ్రరాష్ట్ర నిర్మాణం రాజకీయ నాయకులకు వదలిపెట్టండి" అన్నారు. ఆయన అభిప్రాయంలో రాజకీయనాయకులంటే కాంగ్రెసు నాయకులని మాత్రమే కాక, ఆంధ్రేతర రాజకీయనాయకులని కూడా నిగూఢార్థముందేమో! లేకుంటే ఆంధ్రరాష్ట్రం సత్వరం వద్దని ఆంధ్రుల్లో ఏ అగ్రనాయకుడన్నాడు?

ఇక సభాధ్యక్షుల పలుకుల్లు మరీ నిరాశాజనకంగా వున్నాయి. వారి చిట్కాలలో మొదటిది "మనం జే. వీ. పీ. రిపోర్టు ఆధారంగా చేసుకుని తమిళ సోదరులతో కలసి కూర్చుందాం" అని- ముందు ఆ విషయంమీద ఆంధ్రులలో ఏకాభిప్రాయం కుదిరిందా? మనలోనే ఏకాభిప్రాయం లేనినాడు తమిళ సోదరులను కలుసుకోడానికి తొందరెందుకు? హైదరాబాదు భవితవ్యంలో మనం జోక్యం కలుగజేసుకోవద్దంటూ హైదరాబాదు పల్లెల నుండి కూడా మహజర్లు పంపుదామన్నారు. ఇది వింతగాలేదా? ఆరు నెలలలో రాష్ట్రం రాకపోతే తెలుగు శాసనసభ్యులు తెలుగులో మాట్లాడాలట. అందరూ మనల్ని పగటి వేషగాళ్లలా చూసి వినోదించడం తప్ప దీనివలన ప్రయోజనం కలగదు.

ఇంతకీ అసలుసంగతికి రావాలంటే "మనం రాష్ట్రసాధనకి ఏయే మార్గాలవలంబించాలి" అనేది అతిరహస్యంగా వుంచాలి. రహస్యం రాజనీతిజ్ఞతకి ప్రథమ సూత్రం. నాయకులా మార్గాలని బట్టబయలుచేసి కూర్చోకూడదు.

ఇలా చేద్దాం అలా చేద్దాం అని ఒక సంవత్సరం ముందుగా ప్రోగ్రాంవేసి దానికి ప్రచారం కల్పిస్తే, దానిలో ఎంత విలువ వుంటుందో, అది యెంత ప్రయోజనం సాధిస్తుందో సామాన్యుడే తెలుసుకో గలిగినప్పుడు పెద్దలు సులభంగా అవగాహన చేసుకోగలరు.

"ఆంధ్రులలో ఐకమత్యం రావాలి" అనే సూక్తి పాతబడిపోయింది. దాన్ని పదిసార్లు వినడంవల్ల ఏ ఆంధ్రునికీ సంతృప్తికలుగదు. ఐకమత్యాన్నిగురించి బిగ్గరగా ధర్మపన్నాలు వల్లించే పెద్దలు, మిగతా నాయకుల్ని సమావేశపరచి, వారిమెట్టుకు తాము దిగో, తమ మెట్టుకు వారినిదింపో సమాధానం కుదుర్చుకున్ననాడే, మన మేదైనా సాధించగలం. అంతేకాని, సభలతో సంతృప్తిపడి బిగ్గరగా రాష్ట్రం కావాలంటే దానివల్ల ప్రయోజనమాత్రేవుండదు.

నిజంగా ఫలితాలే దృష్టిలో పెట్టుకుంటే మన నాయకులికి తమలో తాము ఏకాభిప్రాయం కుదుర్చుకోడంకంటే గత్యంతరంలేదు. అది కుదరనినాడు మనకు రాష్ట్రం వచ్చినా, మన మనస్పర్థలు, విభాగాలు, పార్టీలు మన ఆస్థిలో అధిక భాగాలుగావచ్చి మన ల్నిల్లాగే ఆందోళనకి గురిచేస్తూ కుంగతీస్తూంటాయి.

—జయంతి కామేశ్వరి.